"సార్! ఈ సంచి.... మీ కోసమని."

"సంచేమిటి ! ఏమున్నాయి సంచిలో ? నాకోసం తేవటమేమిటి ?"

# వాంటింగ్



"మాకు మామిడి తోటవుంది సార్. మీ కోసమని ఓ పాతిక చెరుకు రసాలు తెచ్చాను సార్ .... మా బిల్లు పాసైందా సార్?"

"ఓహో: అదాసంగతి. బిల్లు పాస్ చేయించుకోవటానికి మామిడిపళ్ళు లంచంగా యిస్తున్నా వన్నమాట."

"అబ్బెబ్బె. అంత మాటనకండి సార్ .... మా తోటలోనిపళ్ళు మీకు రుచిచూపిద్దామని.... మాట వరసకు "బిల్లు పాసైందా" అని అడిగాను కాని........"

"చూడు రాఘవులూ .... నువ్విలా, ఆఫీసులో నా ఒక్కడికే పళ్ళు తెచ్చిచ్చావనుకో: చూసే మిగతా స్టాఫ్ అంతా ఏమనుకుంటారు? అయినాఇలాంటివి నాకు అలవాటు లేదు. నువ్వు ఈ పళ్ళు ఇచ్చినా ఇయ్యకపోయినా ఇవేళ నీ బిల్లు పేమెంటు చేసేదిలేదు. హెడ్డాఫీసు నుంచి "కేష్" ట్రాన్స్‌ఫర్ కాలేదు. రేపు రావొచ్చు. వస్తే పేమెంట్ ఇచ్చేస్తాను రేపు."

"అలాగంటే ఎలా సార్? తమరు ఈ పళ్ళు తీసుకోవలసిందే. మీ కోసమని తెచ్చిన పళ్ళు తీసుకుపొమ్మంటే ఎలా సార్? ఈ సారి వచ్చినప్పుడు 'చక్కెర

## పినిశెట్టి శ్రీనివాసరావు

కేళీ. గెల తెస్తాను .... ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోతాను. రేపు ఆఫీసుకు రాగానే. మొట్టమొదటగా నా బిలే చేసి పెట్టాలి తమరు."

'చక్కెరకేళీ లంటే ఇంట్లో అందరికీ ఇష్టమే. అయినా వీడేమిటి: నాకు ఇష్టం లేని పనులు.... అలవాటులేని పనులు.... బలవంతంగా చేయిస్తున్నాడు. నా మీద వీడికేమిటో ఈ అభిమానం? ఆఫీసులో ఇంతమంది ఉండగా నా ఒక్కడికే పళ్ళు తెచ్చి పెట్టటంలో ఉద్దేశ్యం? దాన్దేముంది. ఒకర్ని చూస్తే పెట్టబుద్దేస్తుంది.... ఒకర్ని చూస్తే మొట్ట బుద్దేస్తుంది.... అన్నట్లు వాడికి నా మీద ఎలాగో అభిమానం పుట్టుకొచ్చినట్టుంది. పళ్ళు తెచ్చిపెట్టాడు. అంతేగాని లంచం పెట్టి పని చేయించుకోవాలన్న దురుద్దేశ్యం వాడి మాటల్లో కనపడటంలేదు. వాడికెంత అభిమానం లేకపోతే వచ్చేసారి చక్కెర కేళీ గెల తెస్తానన్నాడు?' హెడ్‌క్లర్క్ రామారావు తను తీసుకుంటున్న మామిడిపళ్ళు ఏ మాత్రం 'లంచం' రూపేణా కాదు అన్న నిర్ణయానికి వచ్చిన తర్వాత.

"సర్లేవోయ్ చెప్పానుగా ప్రస్తుతానికి బ్యాంక్‌లో డబ్బుల్లేవని.... రేపు డబ్బొస్తే. నీ బిల్లు పాస్‌చేసి చెక్కు యిచ్చేస్తాను" అన్నాడు.

అన్నట్టుగానే .... అనుకొన్నట్లుగానే. అందరికంటె ముందుగానే మర్నాడు అతని బిల్లు పాస్‌చేసి. చెక్కు యిష్యూ చేసేశాడు రామారావు.

* * *

నెల రోజుల తర్వాత రాఘవులు బిల్లు మరొకటి వచ్చింది.

ఆ బిల్లుచూడగానే, తినేసిన చెరుకు రసం మామిడి పళ్ళు— ఈ సారి వచ్చినప్పుడు తెస్తానన్న చక్కెరకేళీ గెల గుర్తొచ్చాయి రామారావుకి.

బిల్లు అంతా చెక్ చేశాడు. అన్నీ సరిపోయాయి. బ్యాంక్‌లో బాలన్స్ వుంది.

అయినా ఎందుకో, రాఘవులు స్వయంగా వస్తేనే గాని బిల్లు పాస్ చేయాలనిపించలేదు రామారావుకు.

"రాఘవుల్ని నేనొకసారి రమ్మన్నానని చెప్పు. బిల్లులో ఇంకా కొన్ని పర్టిక్యులర్స్ 'వాంటింగ్'ఉంది." అంటూచెప్పి పంపించేశాడు, రాఘవులు తరపున చెక్కు తీసుకువెళ్దామని వచ్చిన కుర్రాడ్ని. ●




## ఆకాంక్ష

నీవొచ్చే వరకు
గడపపైనే
నా కళ్ళు రెండూ
రెప్పవాల్చక నిల్చివుంటాయి.
నీ తొలి పాదం
నూపుర ద్యుతులు
నా యింటినెంత
తేజోమయం చేస్తాయో .చూస్తాయి

-గోవిందరాజు రామకృష్ణరావు